# జ్వరం

చినబాబుకి జ్వర మొచ్చింది

జ్వరం ఎవరికైనా వస్తుంది

జ్వరం అందరికీ వస్తుంది

కాని - జ్వరం యింకెవరికైనా రావచ్చు

ఎల్లయ్యకి రావచ్చు, పుల్లయ్యకి రావచ్చు రామారావుకి రావచ్చు, రంగారావుకి రావచ్చు, సుబ్బారావుకి రావచ్చు, సూర్యారావుకి రావచ్చు, ఇంకెవరికైనా రావచ్చు

కాని చిన బాబుకి జ్వరం రాకూడదు

మరోడికీ మరోడికీ జ్వరం వస్తే, ఆసంగతివేరు

ఏ కూలివాడికో, ఏ ముష్టి వెధవకో , ఏ గుమాస్తా గాడికో, మరో కోన్ కిస్కా గాడికో జ్వరం రావచ్చు, తప్పులేదు

కాని, చినబాబుకి జ్వరం రాకూడదు

రాకూడదంటే రాకూడదు

చినబాబంటే ఎవడు?

చినబాబంటే కూలివాడు కాడు, నాలివాడు కాడు, ముష్టివెధవకాడు, గుమాస్తాగాడుకాదు, కోన్ కిస్కాగాడు కాడు

చినబాబంటే సామాన్యుడు కాడు

చినబాబంటే చిన్నవాడేం కాదు.

చినబాబంటే చాలా పెద్దవాడు.

చినబాబంటే చాలా గొప్పవాడు.

చినబాబుకి నలభై ఏళ్ళుంటాయి.

కాని, చూడ్డానికి ముప్ఫయ్యేళ్ళవాడి లాగే కనిపిస్తాడు.

చినబాబుకి నాలుగు మేడలున్నాయి.

కాని, చూడ్డానికి అవన్నీ ఒకే మేడలా కనిపిస్తాయి.

చినబాబుకి నలుగురు భార్యలున్నారు.

కాని, చూడ్డానికి పట్టమహిషి వొక్కతే పట్టపగలు కనిపిస్తుంది.

చినబాబుకి ఎనిమిది ఫ్యాక్టరీలూ, పదహారు పరిశ్రమలూ వున్నాయి.

కాని, చూడ్డానికి ఎనిమిది ఫ్యాక్టరీలూ, ఎనిమిది పరిశ్రమలే కనిపిస్తాయిగాని మిగతా ఎనిమిదీ పైకి కనబడవు.

చినబాబుకి -ఎంతుందో ఎవరికీ తెలీనంతడబ్బుంది. ఎంతుందో తనకే తెలీనంత బంగారం కూడా వుంది. అవి కూడా పైకి కనపడవు.

చినబాబు ఆ ప్రాంతానికి చిన్న సైజు రాజుగారు. పెద్ద సైజు రాజకీయ నాయకుడు.

చినబాబు అందగాడు.

అందరికంటే గొప్పవాడు.

అందలాల్లో విహరించేవాడు.

అలాంటి చినబాబుకి జ్వరం రావచ్చా?

రాకూడదంటే రాకూడదు.

కాని చినబాబుకి జ్వరం వచ్చింది.

అంత గొప్పవాడైన అంత పెద్దవాడైన చినబాబుకి జ్వరం వచ్చింది.

పోనీ ఏదో పొరపాటునవస్తే, నాలుక్కరుచుకుని వెంటనే వెనక్కి తిరిగి చక్కా పోవచ్చునా. పోలేదు.

ఒక రోజైంది , రెండురోజులైంది, మూడు రోజు లైంది. నాలుగు రోజులైంది.

అయినా కూడా చినబాబుకి జ్వరం తగ్గలేదు.

నాలుగు రోజులైనా కూడా జ్వరం తగ్గకపోయేసరికి - చినబాబుకి జ్వరం మీద కోపమొచ్చింది.

'వెధవ జ్వరం' అని తెలుగులోనూ ' బ్లడీ ఫీవర్' అని ఇంగ్లీషులోనూ జ్వరాన్ని తిట్టాడు.

పరిచర్యలు చేస్తున్న పెళ్ళాల్నీ దాసదాసీ జనాన్నీఅచ్చంగా తెలుగులోనూ, వైద్యం చేస్తున్న డాక్టర్లని అచ్చంగా ఇంగిషులోనూ తిట్టాడు.

చినబాబుకి చాలా చిరాగ్గా వుంది.

తినడానికి, తాగడానికి, తిరగడానికి, అన్నింటికీ ఈ ' వెధవ జ్వరం' ఈ 'బ్లడీఫీవర్' చినబాబు కడ్డొస్తోంది.

చినబాబు కిష్టమైన వేవీ డాక్టర్లు తిననివ్వడంలేదు' అతని కిష్టమైన వేవీ డాక్టర్లు తాగనివ్వడం లేదు.

బ్రెడ్, గ్లూకోజ్, హార్లిక్స్, ఫ్రూట్ జ్యూస్ - ఇలాంటి ' చెత్త' తినడానికీ, తాగడానికీ చినబాబుకి చాలా కష్టంగా వుంది.

మంచంమ్మీద నుంచి లేవకుండా, లేచి తిరక్కుండా వుండటం మరీ కష్టంగా వుంది.

కూర్చున్న చోటినుంచి లేవకుండా ఈ భూ ప్రపంచమ్మీద లభించే సమస్త భోగభాగ్యాలనీ అందుబాటులోకి తెచ్చుకుని అనుభవించగలిగిన చినబాబుకి - కదలకుండా కూర్చోడం. కదలకుండా పడుకోడం, పాపం మాచెడ్డ చిరాగ్గా వుంది. మహా యిబ్బందిగా వుంది.

నా ల్రోజుల్నించీ మాంసం లేదు. మద్యంలేదు. మదవతి అస్సలులేదు.

ఈ మూడూ లేకుండా మగాడెవడైనా సరే ఒక్క రోజయినా సరే బ్రతకడం దుర్భరం, అంతేకాక అసంభవం కూడా నన్న అభిప్రాయం కలిగిన చినబాబు, పాపం నాల్రోజుల్నించీ ఆ మూడూ లేకుండానే బ్రతకాల్సి వచ్చింది.

అంచేత చిన బాబు బొత్తిగా ' మూడ్'లో లేకుండా వున్నాడు.

అంచేత చినబాబు అందరిమీదా కోపంగా కూడా వున్నాడు.

అంత గొప్పవాడూ అంత పెద్దవాడూ అయిన చిన బాబుకి ఇంత చికాకునీ ఇంత ఇబ్బందినీ ఇంత కోపాన్నీ కలిగిస్తున్న " వెధవజ్వరం" గురించీ, అతని ధర్మాధర్మ పత్నులూ, పరివ్రాజక పరిచారక జనమూ,యింకా బంధుమిత్ర శ్రేయోవర్గాల వారూ కూడా కలవరపడసాగారు.

నాలుగోనాటి రాత్రి కలతనిద్రలో చినాబాబు ఏవో కావాలంటూ స్పష్టాస్పష్టంగా

కలవరించేసరికి - కలవరింతలు కూడా ప్రారంభమైనందుకు డాక్టర్లకీ, ఆ కలవరింత లేమిటో స్పష్టంగా తెలీనందుకు చుట్టూవున్న వారికీ కూడా కలవరం కలిగింది.

చిన బాబు మంచమ్మీద అతనికి దగ్గరగా - డాక్టర్లు అడ్డు పెట్టనంత దూరంగా కూర్చుని, కూర్చున్నట్టుగా పడుకుని, లేక పడుకున్నట్టుగా కూర్చుని, అతని గుండెల మీద చేయివేసి మెల్లగా మెత్తగా నిమురుతూన్న చిన బాబు చిన్న భార్యకి, అనగా అధర్మపత్నుల్లో ఆఖరావిడ మాత్రం - అతని కలవరింతలకి కించిత్తు సిగ్గుపడింది. తానేమీ చెయ్యలేని స్థితిలో వున్నందుకు ఆ వెంటనే తల కిందికి దించుకుని కంట తడికూడా పెట్టుకుంది.

అందుగురించి ఆవిడా విధంగా బాధపడటం న్యాయమే గానీ, ఆ కలవరింతల అసలు రూపం ఏమిటో అర్థం కానందుకు మనం బాధపడాల్సిన అవసరం ఎంత మాత్రమూ లేదు. మన అసలుకథకీ ఆ కలవరింతలకీ ఎంత మాత్రమూ సంబంధం లేదు.

అయితే చినబాబు కలవరించడమూ, మామూలుగా గాక,శరీరంలో ఉష్ణోగ్రత ఉండవలసిన దానికంటే చాలా ఎక్కువగా ఉన్నందువల్ల కలిగిన అపస్మారక స్థితిలో కలవరించడమూ మాత్రం - ఇంతకుముందే చెప్పినట్టుగా ఇంట్లో వారందరినే కాక, డాక్టర్లనికూడా కలవర పెట్టింది.

ఆ రాత్రి ఎలాగో గడిచింది.

అయిదోనాటి ఉదయాన చినబాబు మేడలో - అతని ఆప్తులూ ఆంతరంగికులూ అంతా కలిసి అత్యవసర సమావేశ మొకటి జరిపారు.

అందులో చినబాబుకి వైద్యం చేస్తున్న డాక్టర్లు కూడా పాల్గొన్నారు.

అసలీ జ్వరమేమిటి దీని కథేమిటీ అని అంతా కలిసి డాక్టర్ల నడిగారు.

ఇన్నాళ్ళయినా యింకా తగ్గకపోవట మేమిటని కోప్పడ్డారు.

మీకు చేతకాకపోతే చెప్పండి, మరో సిటీ నుంచి, మళ్ళీ మాట్లాడితే మరో దేశం నుంచి యింకా పెద్ద డాక్టర్లని రప్పిస్తా మన్నారు.

డాక్టర్లు పాపం చాలా విచారించారు. చినబాబు కొచ్చిన రోగం కుదర్చటంకంటే తమ జీవితానికి మరో లక్ష్యం లేదనీ, కుదర్చటానికే గత నాలుగు రోజులుగా తాము చాలా కష్టపడుతున్నామనీ, అయినా కూడా జ్వరం తగ్గకపోవటం చాలా ఆశ్చర్యకరమనీ మరియూ అత్యంత విచారకరమనీ వాపోయారు.

ఒక కుర్రడాక్టరుకి కళ్ళనీళ్ళు పర్యంతంకూడా అయ్యే సరికి అంతా కలసి అతన్ని ఓదార్చారు. ఆ తర్వాత డాక్టర్లంతా విడిగా కలసి దగ్గరగా ఆలోచించారు.

ఆలోచించి, చర్చించి, తర్కించి వితర్కించి ఆ పైన ఒక నిర్ణయాని కొచ్చారు.

ఇదేదో సామాన్యమైన జ్వరం కాదనీ, సామాన్యమైన జ్వరమైతే చినబాబు లాంటి అసామాన్యులకి అస్సలు రాదనీ, వచ్చినా యిన్నాళ్ళు పోకుండా వుండదనీ అంచేత యిదేదో కొత్తతరహా జ్వరమనీ, ఇలాంటి జ్వరం యితర ప్రాంతాల్లో అక్కడక్కడా వస్తున్నట్టు తాము యిప్పుడిప్పుడే వింటున్నామని, ఇది ప్రాణానికికూడా ప్రమాదం కలిగించగల విష జ్వరమేగాని అయినా కూడా చినబాబుకొచ్చిన ప్రమాదమేమి లేదనీ, అతని ప్రాణాలకి తమ ప్రాణాలడ్డు వేస్తామనీ యింకొక్క రెండురోజులు గడువిస్తే చినబాబు వొంటిమీంచి ఈ వెధవజ్వరాన్ని తన్ని తగలేస్తామనీ రెండు రోజుల్లోగా తామా పని చెయ్యలేకపోతే ఆ పైన తమనే అక్కణ్నించి తన్ని తగిలెయ్యవచ్చుననీ డాక్టర్లంతా కలిసి హామీతో కూడినటువంటి ఒక నివేదిక సమర్పించారు.

అందుమీదట చినబాబు బంధుమిత్ర పరివార జనమంతా అందు కామోదించి కాస్త కుదుటపడ్డారు.

ఆవేళ్టి సాయంత్రానికి - బొంబాయిలో వున్న పెద్ద డాక్టర్ల సలహాలు టెలిఫోనులో అందాయి.

ఆ వేళ్టి రాత్రికి -ఢిల్లీ లో మాత్రం వున్న పెద్దమందుల పాకెట్లు విమానంలో అందాయి.

ఆ మందులు వాడిన అరగంటలో చినబాబు జ్వరం పావుడిగ్రీ తగ్గింది.

డాక్టర్లంతా కలిసి ఒకేసారి నిట్టూర్చి అంతా కలిసి ఒకే సారి - ఇంక చినబాబు రోగం కుదిరినట్టే అన్నారు.

ఆ మా ట వినగానే అందరి మొహాలూ అమితానందంతో వెలిగాయి.

చినబాబు ఆరోగ్యం గురించి ప్రొద్దున కళ్ళనీళ్ళెట్టుకున్న కుర్రడాక్టరు - చినబాబు కలవరింతలు విని నిన్న రాత్రి కంట తడిపెట్టిన చినబాబు చిన్న భార్య వంక ధైర్యంగా కన్నెత్తి చూచి, చిన్నగా నవ్వాడు.

* * *

ఆ రోజు రాత్రి - పదకొండున్నరయింది.

చినబాబుకి జ్వరం తిరుగుముఖం పట్టినందువల్ల - యింక ఫర్వాలేదన్న హామీయిచ్చిన పెద్దడాక్టర్లు - రేప్పొద్దున్న వస్తామని చెప్పి యిళ్ళ కెళ్ళిపోయారు. కుర్ర డాక్టర్ని మాత్రం ఎందుకైనా మంచిదని అక్కడే వుంచి వెళ్ళారు.

అతనక్కడే వున్నాడు గాని చిన బాబు దగ్గర మాత్రం లేదు,

పక్కగదిలో పట్టెమంచమ్మీద వాలుగా పడుకున్న చినబాబు చిన్నభార్యకి సమీపాన చేతులు కట్టుకుని నిటారుగా నిలబడి ఆమెవంక వంకరగా చూస్తూ, వింత వింత జ్వరాలగురించి ఆమెకి వివరంగా చెప్తున్నాడు.

చినబాబు మిగతా భార్యలూ, భార్యల్లాంటి వాళ్ళూ, మిగతా వాళ్ళూ కూడా ఎవరి గదుల్లో వారు విశ్రాంతి తీసుకుంటున్నారు.

అంచేత - ఆ రోజు రాత్రి పదకొండున్నర గంటల వేళ - చినబాబు మగత మగతగా పడుకుని ఉన్న గదిలో అతని పరిచర్యలకోసం నియోగింపబడిన పని మనిషి పైడమ్మ తప్ప యింకెవరూ లేరు.

చినబాబు గదిలో చిన్నలైటు మాత్రం వెలుగు తోంది. పైనున్న పంకా తక్కువ స్పీడులో తిరుగుతోంది.చినబాబు చలనం లేకుండా పడుకుని వున్నాడు అతనెప్పుడు కదులుతాడో, ఎప్పుడు లేస్తాడో, ఎప్పు దేమడుగుతాడోనని ఎదురు చూస్తూ , గదిగోడకి జారగిలబడి కూర్చుమంది - పైడమ్మ.

చూపులు చినబాబుమీదే వున్నా పైడమ్మ మనసు మాత్రం అప్పుడక్కడ లేదు.

పైడమ్మ మనసంతా అక్కడికి రెండు మైళ్ళ దూరాన పట్నానికి పెడగావున్న మురికి వాడలోవున్న తన యింటి మీద వుంది

అప్పుడా సమయాన పైడమ్మ మనసంతా అక్కడ లేకుండా ఎక్కడో వున్న తన 'యింటి' మీద వుండటానికి వెనక చిన్న కథ వుంది

చినబాబులాంటి పెద్దవాడి జ్వరానికి సంబంధించిన ఈ కథలో - అతని అనే కానేక పరిచారికల్లో ఒకతైన పైడమ్మ లాంటి అతి సామాన్యమైన దాని కథ చెప్పడం అంతగా న్యాయం కాదుగాని సందర్భ మొచ్చింది గనుక సదరు పైడమ్మ కథకూడా సంగ్రహంగా తెలుసుకుందాం

పైడమ్మ యిల్లు యిల్లు కాదు

అది వొక మామూలు గుడిశె

ఆ గుడిశెలో పైడమ్మ మొదుడు సింహాద్రి వున్నాడు. పైడమ్మ కొడుకు అర్నెల్ల పసివాడున్నాడు.

సింహాద్రి రిక్షా లాగుతాడు కాని నాల్రోజులుగా అతను రిక్షా లాగటం లేదు

నాల్రోజుల క్రితంనాటి రాత్రి అప్పటిదాకా రిక్షా లాగివచ్చిన సింహాద్రి గుడిశె కొచ్చీరాగానే కాళ్ళు లాగుతున్నాయంటూ నులకమంచాని కడ్డంగా పడ్డాడు. అంతే ఆ విధంగా పడ్డవాడు యిప్పటికీ మంచమ్మీద పడేవున్నాడు.

ఆ రాత్రే అతనికి మంటలుమండుతూ జ్వరం వచ్చింది.

ఆ జ్వరం యిప్పటికీ తగ్గలేదు. ఇంకా మండుతూనే వుంది;తనయింట్లోకంటే చినబాబు యింట్లోనే రోజులో ఎక్కువ భాగం పనిచేసే మనిషి పైడమ్మ - రోజూ ఏదో ఒక సమయాన తీరిక చేసుకొని ధర్మాసుపత్రికి వెళ్తూనే వుంది.

ధర్మాసుపత్రిలో పనిచేసే ప్రభుత్వ డాక్టర్లు అతిదయతో యిచ్చిన రంగు నీళ్ళు రోజూ తెచ్చి మొగుడి కిస్తూనే వుంది.

అయినా, నాలుగు రోజులైనా సింహాద్రి జ్వరం ఎంత మాత్రమూ తగ్గ లేదు: పై పెచ్చు యింకా పెరిగింది.

పైడమ్మ పొద్దున ధర్మాసుపత్రిలో , డాక్టరు కాళ్ళ మీద పడితే - ఆ డాక్టరు దయదలచి, రంగునీళ్ళతో పాటు నాలుగు బిళ్ళలుకూడా యిచ్చాడు, పళ్ళు గ్లూకోజు లాంటివి ఎక్కువగా యిస్తుండమని ఎంతో దయతో ఉచితంగా సలహా యిచ్చాడు.

పైడమ్మ మొగుడి కా బిళ్లలు వేసి, చినబాబు యింటికొచ్చి, అతని పెద్ద భార్య కాళ్లమీదపడి, తన మొగుడిసంగతి చెప్పి, మందు గొట్టాలకీ పళ్లకీ పదిరూపాయలిమ్మని ప్రాధేయపడింది.

మా గొడవల్లో మేముంటే మధ్యలో నీఏడు పేమిటి పొమ్మని చినబాబు భార్య పైడమ్మ ప్రార్థన పెడచెవినపెట్టింది. ఇప్పుడు కాదు పొమ్మంది.

అక్కడ్నించి పోడానిక్కూడా పైడమ్మకి అవకాశం దొరకలేదు.

అప్పుడొచ్చిన పైడమ్మ అర్థరాత్రి వరకూ అక్కడే వుండిపోవలసివచ్చింది.

కాస్తపెందరాడ యింటికి వెళ్తానన్నందుకు చివాట్లు కూడా కూడా తినవలసి వచ్చిచంది, చివాట్లు దొరికాయిగాని, పెందరాడే యింటికి వెళ్ళడానికి అనుమతి మాత్రం దొరకలేదు.

అంచేత - ఆ రాత్రి అప్పటివరకూ అక్కడే వుండిపోవలసి వచ్చిన పైడమ్మ - అప్పుడు తన కళ్ళెదుట వున్న తన యజమాని చినబాబుగురించి కాక - ఎక్కడో గుడిశెలో వున్న, నాల్రోజుల్నుంచీ జ్వరంతో, తగ్గని జ్వరంతో పడివున్న భర్త సింహాద్రి గురించీ, పొద్దు నెవుడో పాలిచ్చి వచ్చిన తన పసివాడి గురించీ ఆలోచిస్తోంది; ఆందోళన పడుతోంది.

ఆలోచనతో ఆందోళనతో వున్న పైడమ్మ - అప్పుడే కళ్ళు విప్పిన చినబాబుసైగ చూడలేదు.చూసిన వెంటనే ఖంగారులో చినబాబడిగిందేమిటో సరిగా వినిపించుకోక, వినబడక - పళ్ళ రసానికి బదులు గ్లూకోజు నీళ్ళిచ్చింది.

గ్లాకోజు నీళ్ళగ్లాసుచినబాబు కోపంగా నేలకేసి కొట్టాడు.

పాలరాతి గచ్చుమీద గ్లాసు భళ్ళున పగిలింది. చప్పుడు విని లోపలికొచ్చిన చినబాబు చిన్నభార్య కొట్టిన దెబ్బతో పైడమ్మ చెంప పగిలింది.

పైడమ్మ ఏడవబోయింది; ఏడవకముందే పైడమ్మని గదిలోంచి బయటికి నెట్టివేసింది చినబాబు చినభార్య.

అర్థరాత్రి దాటాక గుడిశెకి చేరుకున్న పైడమ్మకి - గుడిశె నేలమీద దుమ్ములో, అప్పటిదాకా దొర్లి, దొర్లి, ఏడ్చి ఏడ్చి అప్పుడే నిద్రపోయిన కొడుకూ, నులక మంచంమ్మీద అప్పటి దాకా బాధతో కొట్టుకుని అప్పుడే దీర్ఘనిద్రపోయిన మొగుడూ కనిపించారు.

* * *

ఆ మర్నాడు -

చినబాబుకి జ్వరం పూర్తిగా తగ్గిపోయిందుకు అతనింట్లో పెళ్ళంత హడావిడిగా సంబరం జరుగుతోంది. ఆసంబరంలో బంధుమిత్రులూ, అయినవాళ్ళూ, కానివాళ్ళూ పని మనుషుల్తో సహా అంతా ఆనందంగా పాల్గొన్నారు.

' ఇనవు జోర' మొచ్చి చచ్చిపోయిన మొగుడి శవాన్ని తగలెయ్యట మెలాగో తేలని పైడమ్మ మాత్రం ఏడుస్తూ తన గుడిసెలోనే వుండిపోయింది. ●

*(తరుణ మాసపత్రిక - జన్మదిన ప్రత్యేక సంచిక : ఆగస్టు -1973)*